

### మాయావతి కేంద్రంగా

# బాబు తంత్రం



**బీఎస్పీ అధినేత్రితో సుదీర్ఘ భేటీ ★ చిన్నపార్టీలతో రోజంతా మంతనాలు**

**ఎర్రన్నాయుడు ఇంట్లో నేడు విందు ★ ప్రత్యామ్నాయ వేదికపై దేశం ధీమా**

న్యూఢిల్లీ, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి మాయావతి మూడో ప్రత్యామ్నాయ పార్టీల ప్రధాన మంత్రి అభ్యర్థిగా బలపడుతున్నారు. ఆమె ప్రధాన మంత్రి అభ్యర్థి ఎందుకు కాకూడదన్న చంద్రబాబు వ్యాఖ్యలే ఇందుకు అద్దం పడుతున్నాయి. శనివారం తొలిసారి మాయావతిని కలిసిన చంద్రబాబు సుమారు రెండున్నర గంటలపాటు ఆమెతో చర్చలు జరిపారు. అనంతరం విలేకర్లు మాయావతి ప్రధాని అభ్యర్థిత్వం గురించి ప్రశ్నించినప్పుడు సానుకూలంగా స్పందించారు. సీపీఐ నేత ఎ.బి.బర్దన్ ఇదివరకే ఆమెను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. మాయావతిని ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదించి, ములాయంసింగ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీలోని మరికొంత మందికి గాలం వేసి, ఆ పార్టీని వీలైనంతగా చీల్చాలన్న ఉద్దేశంతో చంద్రబాబు యు.ఎన్.పి.ఎ. తరఫున ఆదివారం ఇక్కడ ప్రత్యేక విందు సమావేశం ఏర్పాటు చేశారు. తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత ఎర్రన్నాయుడు ఇంట్లో జరిగే ఈ కార్యక్రమానికి ఓం ప్రకాశ్ చౌతాలా, బృందావన్ గోస్వామి, బాబూలాల్ మరాండీతోపాటు, వామపక్ష అగ్రనేతలు ప్రకాశ్ కారత్, సీతారాం ఏచూరి, ఎ.బి.బర్దన్, డి.రాజాలతోపాటు ఫార్వర్డ్ బ్లాక్, ఆర్.ఎస్.పి. నాయకులు కూడా హాజరు కానున్నారు. మాజీ ప్రధానమంత్రి దేవెగౌడనూ ఆహ్వానించారు. ఆయన పార్టీలో మాట్లాడి చెబుతానని పేర్కొన్నట్లు తెలిసింది. విశ్వాస పరీక్షకు వ్యతిరేకంగా సాధ్యమైనంత ఎక్కువ మంది సభ్యులను కూడగట్టి, యూపీఏ ప్రభుత్వాన్ని కూలగొట్టాలన్న లక్ష్యంతో ఢిల్లీలో అడుగుపెట్టిన చంద్రబాబు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ తీరిక లేకుండా చర్చల్లో మునిగారు. శనివారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు చంద్రబాబు తన పార్టీ ఎం.పి.లతో కలిసి ఇక్కడి హుమయూన్‌రోడ్డులోని మాయావతి నివాసానికి వెళ్లారు. సాయంత్రం 4 గంటల వరకూ అక్కడ సమావేశం జరిగింది. మాయావతి-చంద్రబాబు భేటీపట్ల తెలుగుదేశం శ్రేణులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ స్నేహం భవిష్యత్తు రాజకీయాల్లో మేలిమలుపు కానుందని బలంగా నమ్ముతున్నాయి. యు.ఎన్.పి.ఎ.లో చేరడానికి ఆమె సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. బహుశా అతి త్వరలో ఆమెను యు.ఎన్.పి.ఎ. అధ్యక్షురాలిగా ప్రకటించవచ్చని తెలుగు దేశం వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబును విలేకర్లు దీనిపై ప్రశ్నించినప్పుడు ఆచి తూచి స్పందించారు. ఇతర యు.ఎన్.పి.ఎ. మిత్రులతో మాట్లాడి, దీనిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారే తప్ప కొట్టిపారేయ లేదు. యు.ఎన్.పి.ఎ.లో చేరితే చేకూరే ప్రయోజనాల గురించి చంద్రబాబు చెప్పిన రాజకీయ సమీకరణాలపై మాయావతి సంతృప్తి చెందినట్లు తెలిసింది. శనివారం ఉదయం ఢిల్లీలో అడుగుపెట్టిన వెంటనే ఆయన సీపీఐ నేత ఎ.బి.బర్దన్‌తో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. మాయావతి భేటీ అనంతరం ప్రకాశ్ కారత్‌ను కలిశారు. సాయంత్రం నాలుగున్నరకు ఆర్ఎల్‌డీ నేత అజిత్ సింగ్, రాత్రి ఎనిమిది గంటలకు మాజీ ప్రధాని దేవెగౌడతో భేటీ అయ్యారు. దేవెగౌడతో జరిగిన సమావేశంలో చంద్రబాబుతోపాటు సీపీఐ నేతలు ఎ.బి.బర్దన్, డి.రాజలు కూడా పాలు పంచుకున్నారు. వీరి భేటీకి కొద్దిసేపు ముందు మాయావతి రాజకీయ కార్యదర్శి సతీష్‌చంద్ర మిశ్రా దేవెగౌడను కలిసి వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. దేవెగౌడ-చంద్రబాబు భేటీ మధ్యలో జె.డి.ఎస్. తిరుగుబాటు ఎంపీ వీరేంద్రకుమార్ కూడా వచ్చి చేరారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి దేవెగౌడ యూపీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని చంద్రబాబు నమ్ముతున్నట్లు తెలిసింది. తాను ప్రభుత్వానికి మద్దతు పలకలేనని ప్రధానికి చెప్పానని దేవెగౌడ... చంద్రబాబు, సీపీఐ నేతలతో అన్నట్లు సమాచారం. ఈ భేటీ అనంతరం కూడా వీరేంద్ర కుమార్ తాను ప్రభుత్వానికి వ్యతిరేకంగానే ఓటేస్తామని స్పష్టం చేశారు. ఓటుపై గౌడ తన నిర్ణయాన్ని స్పష్టం చేయకున్నా వీరేంద్ర కుమార్‌ను కలుపుకొని వెళ్తామని మాత్రం చెప్పారు. దీన్ని బట్టి దేవెగౌడ తప్పకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేస్తారని తెలుగుదేశం నాయకులు నమ్ముతున్నారు. తెలుగుదేశం నాయకుల మాటలను బట్టి అజిత్‌సింగ్ యు.పి.ఎ.కే మద్దతు తెలిపే అవకాశాలు కనిపిస్తున్నాయి. చంద్రబాబు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఫరూఖ్ అబ్దుల్లాతో మాట్లాడే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం విశ్వాస పరీక్ష నెగ్గే అవకాశం లేదని చంద్రబాబు బలంగా నమ్ముతున్నారు. సమాజ్‌వాదీ పార్టీ నుంచి కనీసం 12 మంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేసే అవకాశం ఉందని, ఈ పరిస్థితుల దృష్ట్యా బలపరీక్షకు ముందే ప్రధాని రాజీనామా చేయవచ్చన్న అభిప్రాయం కూడా దేశం నాయకుల్లో వ్యక్తమవుతోంది. ఢిల్లీలోనే ఉన్న కె.సి.ఆర్.తో చంద్రబాబు మాట్లాడే సూచనలు కనిపిస్తున్నాయి. శనివారం జరిగే విందు భేటీకి కె.సి.ఆర్.ను ఆహ్వానిస్తారా? అన్న ప్రశ్నకు చంద్రబాబు స్పష్టమైన సమాధాన మివ్వలేదు. అయితే అణు ఒప్పందం అంశంపై కేసీఆర్‌తో మాట్లాడటానికి తనకేమీ అభ్యంతరం లేదని పేర్కొనడం విశేషం.

చంద్రబాబు మాయావతిని కలిసి వచ్చిన కొద్ది సేపటికే సమాజ్‌వాదీ పార్టీలోని ముఖ్యమైన మైనార్టీ నాయకుడు షాహిద్ సిద్దిఖీ ఆమెను వచ్చి కలిసి బీఎస్పీలో చేరుతున్నట్లు ప్రకటించడం ఢిల్లీ రాజకీయాల్లో సంచలనం రేపింది. సమాజ్‌వాదీ చీలికకు ఇది బలమైన సంకేతంగా కనిపిస్తోంది.

### చర్చల్లో మునిగిన కేసీఆర్

చంద్రబాబు తరహాలో కేసీఆర్‌కూడా ఢిల్లీలో చర్చల్లో మునిగి తేలారు. ఆయన శనివారం సాయంత్రం మాయావతితో భేటీ అయ్యారు. అనంతరం అజిత్‌సింగ్, ఆ తర్వాత దేవెగౌడలతో మాట్లాడారు. అజిత్, దేవెగౌడలను ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేయమని కోరడానికే కలిసినట్లు వెల్లడించారు. ఆయన మరోసారి ప్రధానమంత్రి పదవికి మాయావతి తగిన అభ్యర్థి అని ప్రకటించారు.

## ప్రధాని రాజీనామా చేయాలి: బాబు

అధికారాన్ని నిలబెట్టుకోడానికి బేరసారాలకు దిగేబదులు... ప్రధాని ఇప్పటికే రాజీనామా చేసి ఉండాల్సిందని తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ధ్వజమెత్తారు. మన్మోహన్ సర్కారు విశ్వాసపరీక్షల్లో నెగ్గడానికి అనాగరిక చర్యలకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు. శనివారం ఢిల్లీ వచ్చిన ఆయన యూపీ ముఖ్యమంత్రి మాయావతితోపాటు వామపక్షనేతలు ఎ.బి.బర్దన్, ప్రకాశ్‌కారత్; మాజీ ప్రధాని దేవెగౌడ, ఆర్.ఎల్.డి. నేత అజిత్‌సింగ్‌లతో కలిసిన తర్వాత విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విశ్వాసపరీక్షల్లో ప్రభుత్వం తప్పకుండా ఓడిపోతుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఒక్కో ఎంపీకి రూ.30-40 కోట్ల డబ్బు ఆశచూపడంతోపాటు, మంత్రిపదవులు ఇస్తామని, ఇతర పనులు చేసిపెడతామని బేరసారాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఇది అన్యాయం, అనాగరికమని పేర్కొన్నారు. మాయావతిని యు.ఎన్.పి.ఎ.లోకి ఆహ్వానించే విషయంపై మరో రెండు మూడు సమావేశాల తర్వాత చెబుతామన్నారు. దళిత ఓట్ల కోసం ఆమెను ప్రధానమంత్రి అభ్యర్థిగా చూపుతున్నారని విమర్శలు వస్తున్నాయి కదా అని అడగ్గా "ఆమె రెండుమూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అన్ని అర్హతలు ఉన్నాయి" అని వ్యాఖ్యానించారు. ఈసారి మూడో ఫ్రంట్ అధికారంలోకి రావడానికి చాలా అవకాశాలున్నట్లు విశ్వాసం వ్యక్తంచేశారు.

**బాబుకు దేవెగౌడ పొగడ్త:** 1996లో చంద్రబాబునాయుడు, వామపక్షమిత్రులవల్లే తాను ప్రధానమంత్రి కాగలిగినట్లు మాజీ ప్రధాని దేవెగౌడ పేర్కొన్నారు. తన ఇంట్లో ఆయన చంద్రబాబు, బర్దన్‌తో భేటీ అనంతరం విలేకర్లతో మాట్లాడారు. 1996లో ఢిల్లీకి వచ్చిన తనకు వామపక్షనాయకులు, చంద్రబాబు పూర్తి అండగా నిలిచారని కొనియాడారు. ఈ భేటీలో తమ పార్టీ సమస్యలుకూడా మాట్లాడుకున్నట్లు వెల్లడించారు.